క్లుప్తంగా

నేడు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు

ఐలవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలంలో రూ.43.60 లక్షల వ్యయంతో నిర్మించిన ఐలవరం-1 సచివాలయం, రూ.28.80 లక్షల వ్యయంతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను గురువారం ప్రారంభించనున్నట్లు సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు బుధవారం తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున, వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు. గ్రామంలో రూ.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న త్రీఫేజ్ విద్యుత్ పనులను కూడా ప్రారంభించనున్నట్లు చెప్పారు.

గ్రామాల్లో ఫైలేరియా సర్వే

పిట్టలవానిపాలెం: చందోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వైద్య సిబ్బంది మండలంలోని చందోలు, ఖాజీపాలెం గ్రామాల పరిధిలో ఫైలేరియా సర్వేను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ యు.నరసింహారావు మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు సాయంత్రం 7.30 గంటల నుంచి 10.30 గంటల వరకు చందోలు, ఖాజీపాలెం గ్రామాలలో ఫైలేరియా సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సర్వేలో సూపర్‌వైజర్‌లు నాగేశ్వరరావు, ఎస్‌కె.జానీ, శ్రీనివాసయాదవ్, హేమ సుందరరావు, ఏఎన్‌ఎంలు, ఆశాలు ఉన్నారు.

విద్యుత్తు అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు



కర్లపాలెం(పిట్టలవానిపాలెం): విద్యుత్త చౌర్యం చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని బాపట్ల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గువ్వల ఆంజనేయులు హెచ్చరించారు. కర్లపాలెం మండలంలోని పలు గ్రామాలలో విద్యుత్ సర్వీసుల ఆకస్మిక తనిఖీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్లపాలెం మండలంలో మొత్తం 3,300 విద్యుత్ సర్వీసులను తనిఖీ చేశామని తెలిపారు. అక్రమ విద్యుత్తు వాడకాలు చేస్తున్న వారిపై 97 కేసులు నమోదు చేసి రూ.4.54 లక్షలు అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ బి.హరిప్రసాద్, చెరుకుపల్లి, పొన్నూరు ఏడీఈలు, స్థానిక ఏఈ కుమార్, డివిజన్‌లోని ఏఈలు పాల్గొన్నారు.

వేడుకగా సంక్రాంతి సంబరాలు



బాపట్ల అర్బన్ : స్థానిక సూర్యలంక రోడ్‌లోని వివేక పాస్టర్ స్కూల్లో బుధవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా పొంగళ్లు పొంగించి, విద్యార్థులు పూజలు చేశారు. పిల్లలకు భోగి పళ్ళు పోశారు. ముగ్గులు పోటీలు తదనంతరం జరిగిన గంగిరెద్దుల విన్యాసాలు అందరినీ విశేషంగా ఆకర్షించాయి. ఈ వేడుకల్లో తెలుగు పండిట్ బెజవాడ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ మోహన్ బాబు, ఉపాధ్యాయులు సురేష్, శ్రీనివాసరావు,సైదా, ఆఫీస్ ఇంచార్జ్ శ్రీనివాస్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీసీ డ్రైన్‌కు శంకుస్థాపన



తెనాలిఅర్బన్: 40వ వార్డు వెలుపోలు వారి వీధిలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ డ్రైన్‌కు మున్సిపల్ వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 40వ వార్డు అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తెలియజేసిన సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రత్తిపాడు: ఎలుకల మందు తిన్న వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం.. ప్రత్తిపాడు మండలం రావిపాటివారిపాలెం గ్రామానికి చెందిన వాసిమళ్ల అశోక్ (33) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన అశోక్ ఈ నెల 8వ తేదీన పూటుగా తాగిన మైకంలో మద్యంలో ఎలుకల మందు కలుపుకొని తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ మేరకు అశోక్ తండ్రి వాసిమళ్ల శామ్యూల్ జాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి. రవీంద్రబాబు తెలిపారు.

క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం

ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే కోన



ఖోఖో క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోన



మైదానంలో వాలీబాల్ ఆడుతూ..



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న శ్రీకృష్ణయ్య

పిట్టలవానిపాలెం: క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక సౌష్టవాన్ని పెంపొందిస్తాయని బాపట్ల శాసన సభ్యులు కోన రఘుపతి అన్నారు. మండలంలోని ఖాజీపాలెం మంతెన సుబ్బరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆడుదాం..ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో జాతీయ జెండాతో పాటు క్రీడా జెండాలను ఆవిష్కరించారు.ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ క్రీడలను ప్రారంభించారు. క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి క్రీడాకారులను వయస్సుతో సంబంధం లేకుండా గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడల్లో పాల్గొనేందుకు వీలుగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాపట్ల నియోజకవర్గం నుంచి క్రీడాకారులు రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికై బాపట్ల జిల్లా ఖ్యాతిని రాష్ట్ర స్థాయిలో ఇనుమడింపజేయాలని కోరారు. క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కుంతం అనూష, పార్టీ నాయకులు ప్రసన్నరాజు, మండల పార్టీ కన్వీనర్ లీలా శ్రీనివాసరెడ్డి, మండల ఉపాధ్యక్షులు బడుగు ప్రకాశరావు, మత్స్యకార శాఖ రాష్ట్ర డైరెక్టర్ కె.చెంచయ్య, నరసింహస్వామి దేవస్థానం ట్రస్టు బోర్డు చైర్మన్ శివారెడ్డి, మంతెన గంగరాజు, బండ్లమ్మ కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి ,జిల్లా మహిళా అధ్యక్షురాలు యేట్ర అశ్వినిరెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు మండే విజయ్‌కుమార్, జిల్లా పార్టీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ దేవేంద్రరాజు, వైస్ ఎంపీపీ కృపానందం, పార్టీ నాయకులుకోటిరెడ్డి, సురేష్‌బాబు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

ఆటల పోటీలను సద్వినియోగం చేసుకోవాలి

నగరం: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ చింతల శ్రీ కృష్ణయ్య చెప్పారు. మండల కేంద్రమైన నగరంలో బుధవారం ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి ఆటల పోటీలను ఎంపీపీ ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో శారీరక ధృడత్వంతో పాటు మానసికోల్లాసాన్ని పొందవచ్చునన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.ఆటల పోటీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇంకోల్లు రామకృష్ణ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ మత్తి రవికుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్కంఠ భరితంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు

కొల్లూరు : ఆటల్లో నైపుణ్యమున్న క్రీడాకారులను వెలుగులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం తలపెట్టిన ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు ఆద్యంతం ఉత్కంఠ భరితంగా జరిగాయి. బుధవారం మండల స్థాయిలో జరిగిన పోటీలలో భాగంగా క్రికెట్, బ్యాడ్మింటన్, ఖోఖో పోటీలలో పురుష, మహిళా జట్లు తమ ప్రత్యర్థి జట్లపై తలపడి విజయాలను సాధించాయి. కొల్లూరు బాలురోన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన క్రికెట్ పోటీలలో పురుషుల విభాగంలో జువ్వలపాలెం, క్రాప, కిష్కిందపాలెం, దోనేపూడి, పోతార్లంక, పెసర్లంక, కొల్లూరు-2 జట్లు తమ ప్రత్యర్థి జట్లపై ఫీల్డింగ్, బ్యాటింగ్, బౌలింగ్ విభాగాలలో రాణించి విజయం సాధించి రెండో రౌండ్‌కు అర్హత సాధించాయి. మహిళల క్రికెట్ విభాగంలో దోనెపూడి, చినపులివర్రు, ఈపూరు, కిష్కిందపాలెం, క్రాప, కొల్లూరు-3, రావికంపాడు జట్లు హోరాహోరీగా తలపడి తమ ప్రత్యర్థులపై గెలుపొందాయి. బ్యాడ్మింటన్ పురుషులు విభాగంలో కొల్లూరు-2, అనంతవరం, చినపులివర్రు, ఈపూరు, కొల్లూరు-1, ఈపూరులంక జట్లు విజయం సాధించగా మహిళల విభాగంలో కొల్లూరు-2, కొల్లూరు-1, గాజుల్లంక గ్రామాలకు చెందిన జట్లు విజయాన్ని సాధించి రెండో రౌండుకు చేరుకున్నాయి. ఖోఖో పురుషులు విభాగంలో కొల్లూరు-1, కొల్లూరు-2, ఈపూరు, కొల్లూరు-3, రావికంపాడు, ఈపూరు లంక, చినపులివర్రు, దోనేపూడి జట్లు గెలుపు సాధించగా, మహిళల విభాగంలో కొల్లూరు-3, కొల్లూరు-2, కొల్లూరు-1, గాజుల్లంక, చినపులివర్రు, ఈపూరు, అనంతవరం, చిలుమూరు జట్లు తమ ప్రత్యర్థి గ్రామాల జట్లపై గెలుపొంది తదుపరి దశకు అర్హత పొందాయి. ఆటల పోటీలను కొల్లూరు ఎంపీడీవో ఐ. సత్యనారాయణరావు, తహశీల్దార్ ఎ. శ్రీనివాసరావులు ప్రారంభించారు. న్యాయ నిర్ణేతలుగా పాఠశాలల వ్యాయామోపాధ్యాయులు వ్యవహరించగా, పంచాయతీల కార్యదర్శులు పోటీలను పర్యవేక్షించారు.

ఆడుదాం ఆంధ్రా పోటీలు ప్రారంభం

సూరేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం సూరేపల్లి వీపీ అండ్ జీఎస్‌ఎం హైస్కూల్‌లో బుధవారం మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, సర్పంచ్ మోర్ల విజయలక్ష్మిలు ప్రారంభించారు. యువతకు మేలు చేసేందుకు ఈ క్రీడా పోటీలు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐలవరం సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, ఎంపీడీవో గుమ్మా చంద్రోశేఖరరావు, తహసీల్దార్ డి. వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి టి.అనూరాధ, పీడీలు, పీఈటీలు, తదితరులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనతో ఫైలేరియా దూరం



నేతాజీనగర్‌లో రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్యసిబ్బంది

రేపల్లె రూరల్: దోమకాటుతో వ్యాప్తి చెందే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ సూపర్‌వైజర్ ఎం.యల్లయ్య అన్నారు. ఫైలేరియా వ్యాధి నిర్ధారణకై పట్టణంలోని 24వ వార్డు నేతాజీనగర్‌లో మలేరియా సబ్ యూనిట్ ఆధ్వర్యంలో వార్డు ప్రజల నుంచి రక్తనమూనాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ గృహాల పరిసర ప్రాంతాలలో నిల్వ ఉండే మురుగునీరు, తేమ నిల్వలు ఉండే ప్రాంతాలలో దోమల వ్యాప్తి అధికంగా ఉంటుందన్నారు. ఆడ క్యూలెక్స్ దోమకాటు ద్వారా ఫైలేరియా వ్యాధి వచ్చేందుకు అవకాశం ఉందన్నారు. దోమల నివారణకై మురుగునీరు పారుదల అయ్యేవిధంగా చూసుకోవటంతో పాటు పరిసర ప్రాంతాలలో తేమ వాతావరణం లేకుండా చూసుకోవాలన్నారు.వారంలో ఒకరోజు విధిగా డ్రైడేని పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఫైలేరియా సబ్ యూనిట్ సిబ్బంది కోటేశ్వరరావు, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

చకచకా ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు పనులు



తెనాలిరూరల్: పట్టణంలో దీర్ఘకాలికంగా ఉన్న ప్రధాన సమస్యల్లో ఒకటైన ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివ కుమార్ చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే. సుమారు రెండు నెలల క్రితం పోలీసు అధికారులతో కలసి పట్టణంలో పర్యటించిన ఆయన ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు వివిధ కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని సూచించి ఆయా కూడళ్లను స్వయంగా పరిశీలించారు. ట్రాఫిక్ పిగ్నల్స్ ఏర్పాటు చేయాల్సిన ప్రాంతాలను గుర్తించారు. పట్టణ చెంచుపేటలోని ఉమేష్‌చంద్ర విగ్రహం, కొత్త వంతెన, మార్కెట్ వంతెన, బస్టాండ్ సమీపంలోని సాయిబాబా గుడి, గాంధీచౌక్ సమీపంలోని పాత అశోక్ పెన్ వర్క్స్ సెంటరు, పాత ప్రభుత్వ వైద్యశాల వద్ద, పాత వీనస్ థియేటర్ సెంటరు, కబేళా వంతెన కూడళ్లలో సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. ఇందు కోసం సీసీఎల్ ఫ్యాక్టరీ అధినేత చల్లా రాజేంద్రప్రసాద్ రూ.30 లక్షలు ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. ప్రస్తుతం సిగ్నల్స్ ఏర్పాటు చేసే పనులు చకచకా జరుగుతున్నాయి. మరో 20 రోజుల్లో పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుతో పట్టణంలోని ట్రాఫిక్ సమస్య కొంతవరకైనా పరిష్కారమవుతుందని పట్టణ వాసులు అంటున్నారు.

పేదల ప్రభుత్వానికి అండగా నిలవాలి



పింఛను పంపిణీ చేస్తున్న నాయకులు

రేపల్లె రూరల్: పేదల పక్షపాతి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు అన్నారు. పింఛన్ల పెంపు వారోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని పిరాట్లంక, చెన్నుపల్లివారిపాలెం గ్రామాలలో నూతనంగా మంజూరైన పింఛన్‌లను లబ్ధిదారులకు బుధవారం పంపిణీ చేసి మాట్లాడారు. ఎన్నికల మ్యానిఫెస్టోను నూరుశాతం అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. మేనిఫెస్టోలోని హామీలను అమలు చేయటంతో పాటు ప్రజలకు కావాల్సిన పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేశారన్నారు. పేదల సంక్షేమానికై పాటుపడుతున్న ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దూళిపాళ్ల పుల్లారావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు పంపిణీ

కర్లపాలెం(పిట్టలవానిపాలెం): సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప యాత్రలో ఇచ్చిన హామీ మేరకు ఈ ఏడాది నుంచి ప్రతినెలా రూ.3వేలు పింఛన్‌ను అందించడం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ కర్లపాలెం మండల కన్వీనర్ ఎల్లావుల ఏడుకొండలు అన్నారు. కర్లపాలెం మండలం నర్రావారిపాలెం గ్రామసచివాలయ పరిధిలో బుధవారం కొత్తగా మంజూరైన పింఛన్‌లను లబ్ధిదారులకు అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మార్పు బెనర్జీ, గోవతోటి సుబ్బారావు, వారది వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ హఠాన్మరణం



గడవర్తి సుబ్బయ్య (ఫైల్)

తెనాలి: మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గడవర్తి సుబ్బయ్య (63) హఠాన్మరణం చెందారు. స్థానిక గంగానమ్మపేటలోని స్వగృహంలో బుధవారం మధ్యాహ్నం భోజనం అనంతరం విశ్రాంతి తీసుకుంటూ ఉండగా, నాలుగు గంటల ప్రాంతంలో గుండెపోటు వచ్చింది. కుటుంబసభ్యులు హుటాహుటిన సమీపంలోని ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతిచెందినట్టు ధ్రువీకరించారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. గడవర్తి సుబ్బయ్య తెనాలి మున్సిపల్ కౌన్సిలర్‌గా, మున్సిపల్ వైస్ చైర్మన్‌గా పనిచేశారు. ఆయన భార్య శ్రీదేవి కూడా కౌన్సిలర్‌గా చేశారు. ఆ తర్వాత తెనాలి వ్యవసాయ మార్కెట్‌యార్డు చైర్మన్‌గానూ సుబ్బయ్య బాధ్యతలు నిర్వర్తించారు. మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, టీడీపీ నాయకులు మహమ్మద్ ఖుద్దూస్, కాకుమాను కనకరాంబాబు, పలువురు మాజీ కౌన్సిలర్లు, యాదవ సంఘీయులు సుబ్బయ్య భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అంత్యక్రియలు గురువారం నిర్వహించనున్నట్టు కుటుంబసభ్యులు తెలియజేశారు.

ఎమ్మెల్యే శివకుమార్ సంతాపం..

గడవర్తి సుబ్బయ్య హఠాన్మరణంపై ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. రాజకీయాల్లో సుబ్బయ్యతో తన అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ప్రస్తుతం లోకకళ్యాణార్థం మహాయజ్ఞం నిర్వహిస్తున్న కారణంగా వ్యక్తిగతంగా హాజరుకాలేకపోతున్నట్టు చెప్పారు. యాగం ముగిసిన తర్వాత కుటుంబసభ్యులను పరామర్శిస్తానని చెప్పారు.

లయోలా పాఠశాలలో అలరించిన సైన్స్ ఎగ్జిబిషన్

గుంటూరు రూరల్: విద్యార్థుల్లోని నైపుణ్యతలను మెరుగు పరిచేందుకు ఎగ్జిబిషన్‌లు ఎంతగానో దోహదపడతాయని మాజీ శాస్త్రవేత్త డాక్టర్ కె ఎలీషామోతీకుమార్ అన్నారు. బుధవారం మండలంలోని నల్లపాడు గ్రామం లయోలా పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎగ్జిబిషన్‌లు విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుతాయన్నారు. పరిశోధనల పట్ల ఆసక్తి, ఆలోచనా శక్తిని పెంచుతాయన్నారు. కార్యక్రమంలో భాగంగా లయోలా సంస్థ ప్రారంభించి 60 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రతి నెల జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఇంటర్‌స్కూల్ టోర్నమెంట్స్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. క్రీడా పోటీలలో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను నల్లపాడు లయోలా పాఠశాల దక్కించుకుంది. ఎగ్జిబిషన్ నిర్వాహకులను పాఠశాల సుపీరియర్ కరస్పాండెంట్ రెవరెండ్ ఫాథర్ డాక్టర్ పీ ఆంథోని, ప్రిన్సిపల్ రెవరెండ్ ఫాథర్ బి సురేష్‌కుమార్‌లు అభినందించారు.

నేడు విద్యుత్తు వినియోగదారుల సదస్సు

చుండూరు(వేమూరు): విద్యుత్తు సమస్యలపై సబ్ స్టేషన్ ఆవరణలో గురువారం ఉదయం 10 గంటలకు కమిటీ సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని అసిస్టెంట్ ఇంజినీర్ లంక అర్జునరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ జాలాది రూబేను, జెడ్పీటీసీ సభ్యురాలు దాట్ల సౌజన్య, మండల వ్యవసాయాధికారి ఆదాం కమిటీ సభ్యులుగా పాల్గొంటారని చెప్పారు. రైతులు, గృహ వినియోగదారులు, ఇండస్ట్రీయల్ యాజమాన్యం, విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను తెలియజేయాలని ఆయన కోరారు.

ఎండీయూ వాహనాల పరిశీలన



పెదకాకాని: ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేయడంలో ఎటువంటి అవకతవకలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పిరత్నం అన్నారు. పెదకాకాని మండలంలోని పెదకాకాని, అగతవరప్పాడు గ్రామాలలో ఇంటింటికీ తిరిగి రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనం ద్వారా సరుకుల పంపిణీ తీరును ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ స్వాతితో కలసి పరిశీలించారు. వాహనంలోని సరుకులను తనిఖీ చేశారు. వాహనం ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న వారందరూ ప్రతి ఇంటికీ వెళ్లి సరుకులు తప్పనిసరిగా అందజేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధలను పాటించాలన్నారు. ఎవరైనా రేషన్ సరుకులు పొందని వారుంటే అలాంటి వారి కోసం ప్రతి నెల 17వ తేదీన సచివాలయం వద్ద ఎండీయూ వాహనం ఏర్పాటు చేసి రేషన్ పంపిణీ చేయాలన్నారు.

పేదల అభ్యున్నతికి ప్రభుత్వం తోడ్పాటు

వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త వరికూటి



మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

మోదుకూరు(వేమూరు): పేదవారి కుటుంబాలు ఉన్నతంగా ఎదగాలంటే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త వరికూటి అశోక్ బాబు అన్నారు. వేమూరు నియోజక వర్గంలోని చుండూరు మండలంలోని మోదుకూరు గ్రామంలో బుధవారం కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు సమిష్టిగా పని చేయాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి కులాలకు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించడం జరిగిందని ఆయన చెప్పారు. గ్రామ సచివాలయం వ్యవస్థ వల్ల ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందించడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో గ్రామ సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు పని తీరు కనిపించడం లేదన్నారు. వారితో పని చేయించుకోవాల్సిన బాధ్యత పార్టీపై ఉందని ఆయన చెప్పారు. గ్రామ స్థాయిలో నాయకులకు ప్రజా ప్రతి నిధులకు పూర్తి స్థాయిలో అధికారం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జాలాది రూబేను, జెడ్పీటీసీ సభ్యురాలు దాట్ల సౌజన్య, గ్రామ సర్పంచ్ షాలీ, చుండూరు గ్రామ సర్పంచ్ వుయ్యూరి అప్పి రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు అన్నప రెడ్డి రాఘరామి రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గాదె శివరామ కృష్ణా రెడ్డి, కారుమూరి వెంకట రెడ్డి, వైస్ ఎంపీపీ అళ్ల వెంకట రమణ రెడ్డి, మండల సచివాలయం కన్వీనర్ అన్నపరెడ్డి వీరా రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు బోగిరెడ్డి అక్కిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు బోగిరెడ్డి శేషురెడ్డి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాల అమలు జగనన్నతోనే సాధ్యం

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈవూరి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఈవూరి

రేపల్లె రూరల్ : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ ఆశయాల అమలు జగనన్నతోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. చెరుకుపల్లి మండలం గుళ్లపల్లిలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో బుధవారం విలేకర్లతో మాట్లాడారు. సామాజిక న్యాయం పాటిస్తూ బడుగు, బలహీనవర్గాలకు జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తున్నారన్నారు. అంబేడ్కర్ కీర్తిని చాటిచెప్పేలా రాష్ట్ర ప్రభుత్వం రూ.400 కోట్ల వ్యయంతో విజయవాడలో నిర్మించిన స్మృతి వనమే ఇందుకు నిదర్శనమన్నారు.125 అడుగుల భారీ అంబేడ్కర్ విగ్రహాన్ని నెలకొల్పి బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవాన్ని ప్రభుత్వం చాటిచెబుతోందన్నారు. ఈ నెల 19వ తేదీన నిర్వహించనున్న విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులతో పాటు అంబేడ్కర్ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

అంబేడ్కర్ ఆదర్శనీయుడు

కొల్లూరు : రాజ్యాంగ సృష్టికర్త డా.బీఆర్.అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిపాలన కొనసాగిస్తుందని వైఎస్సార్ సీపీ నాయకుడు కమ్మెల సాంబశివరావు అన్నారు. ఈనెల 19న విజయవాడంలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణను పునస్కరించుకుని బుధవారం కొల్లూరు సచివాలయం వద్ద నిర్వహించిన సామాజిక సమత సంకల్ప కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుత అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ప్లెక్సీలపై ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది సంతకాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయ, వైస్ సర్పంచి దూళిపూడి కృష్ణ, పంచాయతీ ఈవో బి.మల్లిఖార్జున, వీఆర్‌వో రవి, సచివాలయ కార్యదర్శి సాంబశివరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు నర్ర బుల్లిబాబు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు

పేదలకు దుప్పట్లు పంపిణీ

కోన ట్రస్టు ఆధ్వర్యంలో అందజేత



దుప్పట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

పిట్టలవానిపాలెం: బాపట్ల నియోజకవర్గంలోని ప్రజానీకానికి సహాయం చేయడంలో కోన ఛారిటబుల్ ట్రస్టు ఎల్లప్పుడూ ముందుంటుందని బాపట్ల శాసన సభ్యులు కోన రఘుపతి అన్నారు. మండలంలోని కోమలి గ్రామంలో కోన ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సామాజిక పింఛన్‌దారులకు దుప్పట్లు అందజేశారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి కుల, మత, వర్గ, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పేదవాడికి కష్టం వచ్చిందంటే కోన ఛారిటబుల్ ట్రస్టు ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. బాపట్లను జిల్లాగా చేసుకున్నామని జిల్లాను అభివృద్ధి చేసుకోవాలంటే మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయటంతో పాటు బాపట్ల శాసన సభ్యునిగా మూడో సారి తనను ఎన్నుకోవాలని కోరారు. సచివాలయ పరిధిలోని 128 మంది పింఛన్ దారులకు దుప్పట్లు అందజేశారు. తక్కువ సమయంలో ఈ సభా ప్రాంగణాన్ని అద్భుతంగా ఏర్పాటు చేసిన గ్రామ సర్పంచ్ శ్యామల నాగిరెడ్డిని అభినందించారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలాశ్రీనివాసరెడ్డి, గ్రామ సర్పంచ్ శ్యామల నాగిరెడ్డి, వైస్ ఎంపీపీ కృపానందం, సంగుపాలెం ఎంపీటీసీ సభ్యులు గంగయ్య, బాపట్ల జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు యేట్ర అశ్వినిరెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కె.దేవేంద్రరాజు, మండే విజయ్‌కుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



ప్రత్తిపాడు: హైవేపై కుక్కను తప్పించబోయి ద్విచక్రవాహనదారుడు దుర్మరణం పాలైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం రేవేంద్రపాడుకు చెందిన కూరపాటి భాగ్యచక్రవర్తి (51) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 9వ తేదీన బాపట్ల జిల్లా మార్టూరు గ్రామంలో చనిపోయిన తన బంధువుల కార్యక్రమానికి వెళ్లాడు. కార్యక్రమం అనంతరం తిరిగి తన ద్విచక్రవాహనంపై తన స్నేహితుడు పవన్‌తో కలిసి ఇంటికి బయల్దేరాడు. ఈ క్రమంలో ప్రత్తిపాడు మండలం యనమదల గ్రామం సమీపంలో పదహారవ నంబరు జాతీయ రహదారిపై ఒక్కసారిగా కుక్క అడ్డు వచ్చింది. దీంతో కుక్కను తప్పించబోతున్న సమయంలో బైక్ అదుపుతప్పి భాగ్యచక్రవర్తి కిందపడిపోయాడు. దీంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా బైక్ వెనుక ఉన్న మరొక వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుని కుమారుడు కూరపాటి ప్రదీప్ చంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ప్రత్తిపాడు ఎస్ఐ డి. రవీంద్రబాబు తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

ప్రత్తిపాడు: పదో తరగతి విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై స్థానిక పోలీస్ స్టేషనులో కేసు నమోదయ్యింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ప్రత్తిపాడు మండలానికి చెందిన విద్యార్థిని (15) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతుంది. ప్రస్తుతం పాఠశాలకు సంక్రాంతి సెలవులు కావడంతో ఇంటి వద్దనే ఉంటుంది. ఈ నెల 9వ తేదీన తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లారు. సాయంత్రం పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వచ్చేటప్పటికి ఇంట్లో విద్యార్థిని కనిపించలేదు. చుట్టుపక్కల ప్రదేశాలతో పాటు బంధువుల ఇళ్లలో వెతికినప్పటికీ ఫలితం కనిపించలేదు. దీంతో బుధవారం బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ డి.రవీంద్రబాబు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.